సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 5-8-2025
సంపుటి: 21 సంచిక: 114
పేజీలు: 8 వెల: రూ.1

# కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం..!

- కలెక్టర్ ఎదుటే పురుగుల మందు సేవించిన వైనం
- ఆసుపత్రిలో చేర్చిన సిబ్బంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కలెక్టరేట్‌లో ఆమదాలవలస మండలం మునగవలసకు చెందిన మొదలవలస ధనలక్ష్మీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం కలెక్టరేట్ పోర్టుకో వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ వాహనం నుంచి దిగుతుండగా మహిళ ఎదురుగా వెళ్లి తనతో తీసుకువచ్చిన పురుగుల మందును సేవించింది. ఆమె పురుగుల మందు సేవించే ప్రయత్నం చేస్తుండగానే కలెక్టర్ సిబ్బంది అడ్డుకున్నారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ కలెక్టరేట్ నుంచి ఆమెను సహాయ కలెక్టర్ వాహనంలో పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆమె పురుగుల మందు సేవించిన దాఖలాలు కనిపించలేదని పొన్నాడ వైద్యసిబ్బంది చెబుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ధనలక్ష్మీని 104 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని, ప్రాణాపాయం లేదని చెబుతున్నారు. బాధిత మహిళ తనకు చికిత్స అవసరం లేదని, ఇంటికి వెళ్లిపోతానని - మిగతా చివరి పేజీలో

# కదలడు.. వదలడు!

- రెండు నెలలైనా కొత్త పోస్టులో చేరని ఉద్యోగి
- షాడో ఏవోగా కార్యాలయంలో పెత్తనం
- వసూళ్లు వస్తాయనే ఉన్న సీటుపై తరగని మోజు
- రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులన్నీ పెండింగ్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ శాఖల్లో సాధారణ బదిలీలు జరిగి రెండు నెలలైంది. బదిలీ అయిన వారందరూ దాదాపుగా కొత్త పోస్టుల్లో చేరిపోయారు. కానీ వైద్య ఆరోగ్యశాఖలో ఒక్క ఉద్యోగి మాత్రం ఇంకా పాత సీటును పట్టుకుని వేలాడుతున్నాడు. ఏ దూరప్రాంతానికో.. వేరే ఊరికో బదిలీ అయినందున.. ఇష్టం లేకో, ఇబ్బందులతోనో కొత్త పోస్టులో చేరలేదనుకుంటే పొరపాటు. ఒకే కార్యాలయ భవనంలో కింద ఫ్లోర్ నుంచి పై అంతస్తుకు బదిలీ అయ్యాడంతే! మరెందుకు కొత్త పోస్టులో చేరడం లేదంటే.. ప్రస్తుతం పని చేస్తున్న కింద ఫ్లోర్‌లో ఆయనకో కోటరీ ఉంది. పై సంపాదనకు మంచి సోర్స్ ఉంది. మేడ పైకి వెళ్లిపోతే అదంతా పోతుందన్నదే ఆయనగారి బాధ. దాంతో తన కోటరీ హెడ్ అయిన ఏవో సహాయంతో ఇక్కడే తిష్ట వేయాలని ప్రయత్నిస్తున్నాడు. రిలీవర్ రానందువల్లే తాను కొత్త పోస్టులో చేరలేకపోతున్నానని సాకులు చెబుతున్నాడు.

**కుమ్మక్కు వ్యవహారాలు**

ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని పరిపాలన విభాగం(ఏవో)లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉదయ్ కుమార్‌కు జూన్ 23న అదే కార్యాలయంలోని పై అంతస్తులో ఉన్న టీడీ ఐడీ కార్యాలయానికి బదిలీ అయ్యింది. ఇప్పటివరకు - మిగతా చివరి పేజీలో



- రూ.కోట్లు విలువైన స్థలంపై ఆ నలుగురి కన్ను
- వైకాపా హయాంలో మంత్రి పేషీ పేరుతో విఫల యత్నాలు
- అది ప్రభుత్వ భూమి అని గతంలోనే కలెక్టర్ నిర్ధారణ
- టీడీపీ సర్కారు వచ్చిన ఏడాది తర్వాత మళ్లీ అవే పన్నాగాలు




# లోపాల రీసర్వేతో పాపాల ప్లాన్!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చావోస్ థియరీ (గందరగోళ సిద్ధాంతం) ప్రకారం బటర్ ఫ్లై ఎఫెక్ట్ అని ఒకటి ఉంటుంది. వ్యవస్థలో చిన్న చిన్న మార్పులు.. మరోచోట ఊహించని పెద్ద పరిణామాలకు కారణమవుతాయని ఈ సిద్ధాంతం చెబుతుంది. ఇది ఏ మేరకు నిజమనేది చెప్పడానికి ప్రపంచంలో జరిగిన అనేక సంఘటనలను శాస్త్రవేత్తలు ఉదహరిస్తుంటారు. సరిగ్గా ఆ సిద్ధాంతాన్ని బలపరిచే సంఘటనే శ్రీకాకుళం నగరంలో జరిగింది.. జరగబోతోంది.

**చెత్తలున్నప్పుడు అక్కర్లేదు**

శ్రీకాకుళం ప్రజానీకం నిత్యం విడిచిపెట్టే వ్యర్థాలను వేయడానికి గతంలో జిల్లాపరిషత్ పక్కన డంపింగ్ యార్డును ఏర్పాటు చేయగా.. ఆ తర్వాత దాన్ని షిఫ్ట్ చేసి ఆ స్థలంలో హుద్‌హుద్ కాలనీ - మిగతా చివరి పేజీలో

# అయిపోయిందా పాలు తీత.. రోడ్డుపై మేత!

- ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న పశువులు
- విద్యార్థులపై తిరగబడుతున్న ఆవులు
- కనీసం పట్టించుకోని కాపరులు
- చర్యలకు ఉపక్రమించిన నగరపాలక సంస్థ అధికారులు
- ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరిస్తున్న యజమానులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇక్కడ కనిపిస్తున్నది మండలవీధి జంక్షన్ దాటిన తర్వాత ట్రైనింగ్ స్కూల్, బాలికోన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు. దానిపై ఉన్నది ఆవులు అంతేకదా.. అనిపిస్తుందా మీకు. చూడ్డానికి చిన్న సమస్యలాగే ఉంది. కానీ నగరంలో ఇదొక పెద్ద తీర్చలేని బాధ. మున్సిపల్ యంత్రాంగం కాస్త చొరవచూపి చర్యలు తీసుకుందామంటే రాజకీయ గణం అడ్డొస్తోంది. పశువులకు ఓట్లు లేకపోవచ్చు. కానీ దాని కాపర్ల పేరిట ఓ కుటుంబం ఉంటుంది. వారికి ఓటు ఉంటుంది. రోడ్డుపై అడ్డంగా పడివున్న పశువులను బందల దొడ్డికి తరలిస్తే అంతుచూస్తామని స్వయంగా మున్సిపల్ యంత్రాంగాన్నే బెదిరించేంతటి రాజకీయం దీని వెనుకుంది. నడిరోడ్డు మీద వాహన చోదకుడు ఏమైపోయినా ఫర్వాలేదు. పశువులను మాత్రం కదల్చడానికి వీల్లేదు. ఇలా ఉంది నగరంలో వీరి పరిస్థితి.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా పశువులు రోడ్డుపై తిష్టవేస్తున్నాయి. పాలుపితకడం అయిపోయిన వెంటనే కనీసం కొన్నింటికి మెడకు ఉన్న కన్ని కూడా విప్పకుండా వాటి యజమానులు అలాగే వదిలేసినట్టున్నారు. అసలే స్కూల్‌కు వెళ్లే సమయం, అందులోనూ ఆఫీసులకు వెళ్లేవారు టౌన్‌లోకి వచ్చేవేళ. ఇరుకు రోడ్డు, ఆపై రోడ్డు ఆక్రమించుకొని తిష్టవేసిన పశువులు. వీటిని దాటి వెళ్లే సమయంలో అవి పొడిచేస్తామన్నట్టు తలూపడం.. వీటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

**ఆహారం వేసే దిక్కులేదు**

శ్రీకాకుళం నగరంలో పశువుల పెంపకందార్ల గురించి అందరికీ తెలిసిందే. ఎందుకంటే ఉదయం, సాయంత్రం వేళల్లో పాలు పితకడం, తిరిగి ఊరిమీదకు వదిలేయడం తప్ప, వాటి సంరక్షణ, ఆహారం వేసే దిక్కు లేదు. ఇంకా చెప్పాలంటే కనీసం పెంచుతున్నామని చెబుతున్న పశువుల యజమానులు వాటికి కనీసం నీరు కూడా పొయ్యని పరిస్థితి. దీంతో అవి రోడ్లపై పడి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడంతో పాటు పలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నగరంలో ఎక్కడైతే రోడ్ల పక్కన ఫుడ్‌స్టాల్స్ ఉన్నాయో వాటికి దగ్గరలో ఉన్న డస్ట్‌బిన్లు ఒకరోజులో మూడు పూటలు నిండిపోతుంది. మున్సిపల్ యంత్రాంగం కేవలం ఏదో ఒకపూట మాత్రమే దాన్ని క్లియర్ చేస్తారు. మిగిలిన రెండుపూటలు ఇందులో మిగిలిన ఆహారాన్ని, ఎంగిలి ఆకులను (పాలిథిన్ కవర్లతో సహా) పశువులు తింటున్నాయి. బహుశా సంప్రదాయ చిట్టు, తవుడు, కుడితి వంటివి తినిపించడం కంటే రోడ్డు మీద పడి తినడం వల్ల ఎక్కువ పాలు ఇస్తున్నాయేమో తెలియదు గానీ, పాలు పితికిన వెంటనే వీటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. నగరంలో మెయిన్‌రోడ్లలో అయితే ఆవులు, మిగిలిన రోడ్లలో గేదెలు, ఖాళీ స్థలాల్లో పందులు కార్పొరేషన్‌లో ఆల్‌ఫ్రీ బతుకును వెలగబెడుతున్నాయి.

**రోడ్లపైనే మేపుతున్న భక్తులు**

ఈమధ్యకాలంలో చాగంటి కోటేశ్వరరావు, గరికిపాటి నరసింహారావు లాంటివారి ప్రవచనాలు ఎక్కువగా ప్రాచుర్యంలోకి రావడం వల్ల మన తెలుగు రాష్ట్రాల్లో భక్తి రోడ్లపైన పొంగి ప్రవహిస్తోంది. ఇందులో ఏ పాపం పోవాలంటే ఏ జీవికి ఏ తరహా ఆహారం పెట్టాలో ఒక జాబితా ఉంది. ఆ మేరకు గ్రహదోషాలు పోగొట్టుకోడానికి, చేసిన పాపాలు పోవడానికి అన్నట్టు ఆవులకు రకరకాల మేతలు పెట్టే భక్తులు ఎక్కువైపోయారు. దీంతో ఇదే బాగుందని యజమానులు వదిలేస్తున్నారు. ముందురోజు ఆహారం దొరికిన స్థలం వద్దే మరుసటి రోజు పశువులు పాగా వేస్తున్నాయి.

**నగరపాలక అధికారులపై తిరుగుబాటు**

ఈ నేపథ్యంలో రోడ్లపై విచ్చలవిడిగా సంచరించే, లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను నగరపాలక సంస్థ ఆదేశాల మేరకు పట్టుకుంటున్నారు. పశువుల యజమానుల నుంచి ఫైన్ కట్టించుకొని లేదా వారిని మందలించి విడిచిపెడుతున్నారు. కొందరు ఎవరికోసం విడిచిపెట్టరు అని కనీసం వాటిని విడిపించుకునే ప్రయత్నాలు కూడా చేయడంలేదు. దీంతో పట్టుకున్న పశువులను మేపలేని పరిస్థితి నగరపాలక అధికారులకు ఎదురవుతోంది. ఇదిలా ఉంటే రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతూ ఇబ్బంది కలిగిస్తున్న పశువులను నగరపాలక సంస్థ నియమించిన సిబ్బంది పట్టుకుంటున్న సమయంలో ఆయా పశువుల యజమానులు వారిపై తిరగబడటం, లేదా అధికారులనే బెదిరించే స్థాయికి ఎదిగిపోయారు. ఏమంటే ప్రతీ చిన్న విషయానికీ ఎమ్మెల్యే పేరు వాడుకోవడం వీరికి కూడా పరిపాటైపోయింది.

**కనీసం కానిస్టేబుల్ కూడా ఉండరు**

ఇక నగరంలో ఉదయం, సాయంత్రం అత్యంత రద్దీగా ఉండే రోడ్డు.. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతం ఉమెన్స్ కాలేజీ రోడ్డు. సూర్యమహల్ నుంచి ఉమెన్స్ కాలేజీ రోడ్డు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 వరకు, అలాగే సాయంత్రం 3.30 నుంచి 4.30 వరకు సైకిల్‌పై రాకపోకలు సాగించాలన్నా ఇబ్బందిగా ఉండే సమయం. అందులోనూ ఇక్కడ కార్పొరేట్ స్కూల్స్ బస్సులు కూడా రోడ్డుపైనే నిలుపుతారు. ఇదే రోడ్డులో ప్రభుత్వ పాఠశాలలు, ఉమెన్స్ కాలేజీ కూడా ఉన్నాయి. కనీసం పాఠశాలలకు విద్యార్థులు వెళ్లినప్పుడు ఒక గంట, వచ్చే సమయంలో కనీసం అరగంట ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ఆ శాఖ నుంచి ఒక్క కానిస్టేబుల్ కూడా ఇక్కడ కనిపించరు.

ఇప్పటికైనా రోడ్లపై విచ్చలవిడిగా సంచరించే పశువుల విషయంలో నగరపాలక అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ప్రతీ చిన్న విషయానికీ ఎమ్మెల్యే పేరు వాడుతున్న నేపథ్యంలో ఇటువంటి వాటిపై ఎమ్మెల్యే కూడా స్పందించి, పశువుల యజమానులను హెచ్చరిస్తూ ప్రకటన విడుదల చేయాలని, లేదంటే తామేమీ చేయలేమని అధికారులు వాపోతున్నారు. ఇక స్కూల్స్‌కు వెళ్లే సమయం, అలాగే విడిచిపెట్టేటప్పుడు ట్రాఫిక్ పోలీసులు ఈ రోడ్డుపై గస్తీ నిర్వహించాలని, ట్రిపుల్ రైడింగ్‌లు, స్కూల్స్ వద్ద ఆకతాయిలతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.



పశువుల యజమానులూ..

# తస్మాత్ జాగ్రత్త!



- రోడ్లపై పశువులను విడిచిపెడితే చర్యలు
- కమిషనర్ ఆదేశాలతో హెల్త్ఆఫీసర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలతో సంరక్షణ కేంద్రానికి తరలింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరపాల సంస్థ పరిధిలో విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్ పర్యవేక్షణలో మునిసిపల్ సిబ్బంది పట్టుకొని ఆర్కే నగర్‌లోని పశువుల సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు. పశువుల యజమానులు నగరంలో వారి పశువులని విచ్చలవిడిగా విడిచిపెట్టడం ద్వారా, అవి రోడ్లపై తిష్ట వేసి పాదచారులు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పలు సందర్భాల్లో రోడ్లపై పశువులు వేగంగా వచ్చి వాహనదారుల్ని ఢీకొట్టడం, తీవ్ర గాయాలై వాహన చోదకులు ఆసుపత్రిపాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాగే పశువులు రోడ్లపై పేడ వెయ్యడంతో తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ప్రత్యేక బృందాలని ఏర్పాటుచేసి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను పట్టి, వాటి యజమానులకు మున్సిపల్ యాక్ట్ ప్రకారం నిర్ణయించిన అపరాధ రుసుము విధిస్తున్నారు. ఇకపై రోడ్ల మీద పశువులను విడిచిపెడితే తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. కార్పొరేషన్ తీసుకున్న ఈ చర్యల పట్ల ప్రజలు హర్షం తెలుపుతున్నారు.



• ఎడిటోరియల్

# ప్రపంచ వలసల్లోనూ మనమే ఫస్ట్!

మానవ పరిణామక్రమంలో వలసలు చాలా కామన్. ఆదిమ మానవ యుగం నుంచే ఇవి కొనసాగుతున్నాయి. ప్రధానంగా ఆహారం, నీరు వెతుక్కుంటూ ఆ యుగంలో మానవులు దూరతీరాలకు వలసపోయేవారు. ఇప్పటికీ ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని చాలా దేశాల్లో సంచార జాతులవారు మనుగడ సాగిస్తున్నారు. అలా మొదలైన వలసల జీవనం నాగరికత పెరిగినా.. ఉపాధి, ఆహారం, నీరు వంటి వసతులు కొన్ని వందల రెట్లు పెరిగి అందుబాటులోకి వచ్చినా ఇప్పటికీ ప్రపంచంలో వలసలు కొనసాగుతుండటం విశేషం. అది కూడా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగి, నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగిన భారతదేశం నుంచి వలసలు అత్యధికంగా జరుగుతుండటం విస్మయం కలిగిస్తోంది. వలసల్లో ప్రపంచంలో భారతదేశమే అగ్రస్థానంలో ఉందని సాక్షాత్తు ఐక్యరాజ్య సమితి తాజాగా విడుదల చేసిన గ్లోబల్ మైగ్రేషన్ నివేదికలో వెల్లడించింది. 2024 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఏకంగా 1.85 కోట్ల మంది ప్రవాస భారతీయులు ఉన్నట్లు ఆ నివేదిక పేర్కొంది. మొత్తం అంతర్జాతీయ వలసదారుల్లో భారత్ సుమారు ఆరుశాతాన్ని ఆక్రమించిందని స్పష్టం చేసింది. ప్రపంచ వలసదారుల మొత్తం సంఖ్య 30.4 కోట్లుగా ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2020లో ఈ సంఖ్య 27.5 కోట్లుగా ఉండగా నాలుగేళ్లలో వలసదారులు నాలుగు కోట్ల మేరకు పెరిగినట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ జాబితాలో మన దేశం తర్వాత చైనా 1.17 కోట్ల వలసదారులతో రెండో స్థానంలో ఉంది. ఇక మెక్సికో 1.16 కోట్ల వలసదారులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉక్రెయిన్ (98 లక్షలు), రష్యా (91 లక్షలు) ఉన్నాయి. భారత్ విషయానికొస్తే.. ఒకప్పుడు భారతీయులు ప్రధానంగా సౌదీ అరేబియా, పాకిస్తాన్ వంటి దేశాలకు ఎక్కువగా మైగ్రేట్ అయ్యేవారు. కానీ ఇప్పుడు పశ్చిమాసియాతో పాటు అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి పశ్చిమ దేశాలకు భారతీయుల వలసలు విస్తరించాయి. వలస భారతీయుల పరిమితి పెరగడమే కాకుండా ఆయా దేశాల్లో వారు ప్రభావితం చేసే సామాజిక, ఆర్థిక పరిస్థితులను కూడా నివేదిక వివరించింది. యూఏఈలో భారతీయులు అత్యధికంగా వలస జీవనం సాగిస్తున్నారు. సుమారు 32.5 లక్షల మందితో యూఏఈ మొత్తం జనాభాలో మనవారే 40 శాతానికి పైగా ఉన్నారని నివేదిక చెబుతోంది. ఇది పశ్చిమాసియాలోని భారతీయ దయాస్పోరా విస్తృతిని చూపించే ఒక కీలకాంశం. ఇక అమెరికాలో ఉన్న ఇండో–అమెరికన్లు రెండో అతిపెద్ద ఆసియన్ వర్గంగా ఉన్నారు. మొదటి స్థానంలో చైనీస్ అమెరికన్లు ఉన్నారు. అమెరికాలో భారతీయుల సంఖ్య 31.7 లక్షలు కాగా సౌదీ అరేబియాలో 19.5 లక్షలు, కెనడాలో 10.2 లక్షల మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. భారతీయ వలసదారులకు పెద్దఎత్తున ఆశ్రయం కల్పిస్తున్న ఇతర దేశాల్లో ఆస్ట్రేలియా, కువైట్, ఒమన్, ఖతార్, బహ్రెయిన్, మలేషియా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), పాకిస్తాన్ వంటి దేశాలు ఉన్నాయి. ఈ అధ్యయన నివేదిక వల్ల గ్లోబల్ వలస ధోరణులపై మెరుగైన అవగాహన ఏర్పడుతుంది. ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు, ఉపాధిని వెతుక్కుంటూ చాలామంది భారతీయులు ముఖ్యంగా యువత విదేశాలకు వెళుతున్నారు. వారిలో చాలామంది స్వదేశానికి తిరిగి రాకుండా అక్కడే స్థిరపడిపోతున్నారు. ఐటీ రంగం బహుముఖంగా విస్తరించిన తర్వాత భారతీయ కంప్యూటర్ నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరగడం వంటి అంశాలు కూడా వలసల పెరుగుదలకు కారణమవుతున్నాయి. మరోవైపు వ్యాపారం, ఉపాధి రంగాల్లోనూ అవకాశాల కోసం పెద్దసంఖ్యలో భారతీయులు విదేశాలకు వెళ్తున్నారు. మొత్తం మీద దాదాపు ప్రపంచం నలుమూలలా భారతీయుల జాడ కనిపిస్తోందని ఈ నివేదిక వెల్లడించింది. ఇలా విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్న భారతీయులు ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఐటీతో పాటు ఆరోగ్య, నిర్మాణ రంగాల్లో వారి కృషి గణనీయంగా ఉందని నివేదిక పేర్కొంది. అంతర్జాతీయ వలసల్లో భారత్ అగ్రస్థానంలో ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవాస భారతీయుల సంక్షేమానికి పలు చేపడుతున్న చర్యలు మరింత మెరుగవ్వాల్సి ఉంది. రవాణా సౌకర్యాలు, వీసా సౌలభ్యాలు, న్యాయ పరిరక్షణ వంటి అంశాల్లో మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. ఇటీవలి కాలంలో ప్రవాస భారతీయులతో సంబంధాల మెరుగుకు కేంద్ర ప్రభుత్వం 'వైబ్రెంట్ దయాస్పోరా' తరహాలో పలు కార్యక్రమాలు చేపడుతోంది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు విశ్వవ్యాప్తం అవుతున్నాయి.

## బాధితులకు చేయూత



(సత్యంన్యూస్, లావేరు)

మండలంలోని మురపాక పంచాయతీ, శివాలయం వీధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో నాలుగు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. వారంతా నిరుపేద కుటుంబాలు కావడంతో పిలుపు స్వచ్ఛంద సేవా సంస్థ స్పందించి ఆ నాలుగు కుటుంబాలకు రూ.25వేల విలువైన సామాగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పౌండేషన్ అధినేత బింధు మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవ డంలో తమ సంస్థ ముందుంటుందన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమం లో సంస్థ డైరెక్టర్ జి.రవికుమార్, గ్రామ సర్పంచ్ పి.లక్ష్మణరావు, గ్రామ సెక్రెటరీ, మహిళా పోలీస్, అగ్రికల్చర్ ఆఫీసర్, స్థానికులతోపాటు అనేకమంది పాల్గొన్నారు.

## ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా స్థానిక ఏపీఈపీడీసీఎల్ ఎస్సీ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండి అని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా అని వారు ప్రశ్నించారు. స్మార్ట్‌మీటర్ల ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, ప్రజల పైన మరో రూ.12,771 కోట్లు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం మోపడానికి ప్రతిపాదన




తయారు చేసిందని విమర్శించారు. దక్షిణాదిలో కేరళ, బెంగాల్, తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయన్నారు. ఇక్కడ బిజెపి టిడిపి డబుల్ ఇంజన్ సర్కారు స్మార్ట్‌మీటర్లు పెడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు పెట్టి రూ.25వేల కోట్లు భారం ప్రజల మీద వేసి దోపిడీ చేయడానికి పూనుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోత్తకోట అప్పారావు, ఎం.ఎం.గోవర్ధన్‌రావు, ఆర్ ప్రకాష్, బి.సింహాచలం, ఆదినారాయణమూర్తి, వెంకట్రావు పాణిగ్రహి, ఎ.లక్ష్మి, శ్రీదేవి పాణిగ్రహి, ఆర్.ప్రకాష్, కె.చంద్రశేఖరరావు, జె.జ్యోతీశ్వరరావు, డి.పార్వతీశం, కె.బాలకృష్ణ, టి.తిరుపతిరావు, ఎం.సంతోష్, నీలంరాజు, భాస్కరరావు, సుధాకర్‌లు పాల్గొన్నారు.

## ప్రజలపై భారాలు వేయవద్దు




(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై భారాలు వేయొద్దని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్వి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల వద్దు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఎచ్చెర్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా మాట్లాడిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. స్మార్ట్‌మీటర్ల ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. అదానీ స్మార్ట్ మీటర్లు ఖర్చులు నిమిత్తం 93 నెలల్లో అదనపుచార్జీలు వసూలు చేస్తారన్నారు. ఇళ్ళకు బిగించకుండా ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. స్మార్ట్‌మీటర్స్‌కి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డి.బంగారాజు, ఎన్.రమణ, టి.రామారావు, జి. శ్రీనివాసరావు, ఎల్.సీతారాం, ఎస్.కామేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, బి.రాము, సిహెచ్.తేజ, ఎస్.నరేంద్రకుమార్‌లు పాల్గొన్నారు.

### బయో టెక్నాలజీలో ప్రవేశానికి

## దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 2025-2026 సంవత్సరానికిగాను ఎమ్మెస్సీ మెడికల్ బయో టెక్నాలజీలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు తెలిపారు. జువాలజీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ లేదా ఏదైనా ఇతర లైఫ్ సైన్సెస్ సంబంధిత సబ్జెక్టులలో, డిగ్రీ పూర్తి చేసి, ఎ.పి-పి.జి-సెట్-2025లో అర్హత సాధించిన లేదా స్పాట్ అడ్మిషన్‌కి ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలకు హాజరై బయోటెక్నాలజీ విభాగంలో తమ ఆసక్తిని సమర్పించవచ్చున్నారు. కానీ సీటు తుది కేటాయింపు ఎ.పి-పి.జి-సెట్-2025 కౌన్సెలింగ్ లేదా ఎ.పి.ఎస్.సి.హెచ్.ఇ మార్గదర్శకాలపై ఆధారపడి ఉంటుందన్నారు. వైద్యరంగంలో నేటికాలంలో ప్రబలుతున్న కొత్త కొత్త వ్యాధులను నిర్ధారించడంలో, వాటికి ఔషధాల తయారీలో బయోటెక్నాలజీ కీలక పాత్ర వహిస్తుందని కళాశాల బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మధమంచి ప్రదీప్ వివరించారు. ఈ కోర్సు ద్వారా వైద్యరంగంలో వ్యాధుల నిర్ధారణలో, క్లినికల్ రీసెర్చ్ విభాగంలో, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఫార్మా, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల్లో వివిధ స్థాయిల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని నైపుణ్యాలను మెరుగుపరుచుకొని వైద్యరంగంలో ఎంట్రప్రీన్యూర్లుగా ఎదిగే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు ప్రయోగాత్మక అధ్యాయాన్ని పెంచే దిశగా, కళాశాలలోని బయోటెక్నాలజీ విభాగం నగరంలోని ప్రముఖ వైద్యులతో అతిథి ఉపన్యాసాలు, వారి పర్యవేక్షణలో ప్రయోగాలు నిర్వహించేందుకుగాను ప్రఖ్యాత హాస్పిటల్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకొందని తద్వారా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశలు సులభమవుతాయని అధ్యాపకులు డాక్టర్ ఆర్.హరిత, పి.సుధారాణిలు తెలిపారు. మరిన్ని వివరాలకు 8555911961, 7702203953, 6301096643 నంబర్లను సంప్రదించాలని కోరారు.



# 67 ఏళ్ల వయసు.. 37 ఏళ్ల కెరీర్.. ఓ జాతీయ పురస్కారం!



తమిళ దర్శకుడు విసు తెలుగులో తీసిన మొదటి సినిమా 'శ్రీమతి ఓ బహుమతి' తెలిసే ఉంటుంది. దాని తమిళ వెర్షన్ 'తిరుమతి ఒరు వెగుమతి' సినిమాలో 30 ఏళ్ల యువకుడు నటించాడు. చాలా చిన్న పాత్ర. ఇప్పుడు సినిమా చూస్తే అందులో అతను ఉన్నాడని వెతికి గుర్తుపట్టాలి. కానీ అదే యువకుడు 38 ఏళ్ల తర్వాత తన 67వ ఏట జాతీయ పురస్కారం అందుకుంటాడని ఎవరూ అప్పుడు ఊహించి ఉండరు. అదే సినిమారంగం గొప్పతనం. నీలో ప్రతిభ ఉంటే నిన్ను తప్పకుండా ఉంచాల్సిన చోట ఉంచుతుంది. తథ్యం. ఇటీవల ప్రకటించిన జాతీయ సినీ పురస్కారాల్లో ఉత్తమ సహాయనటుడి పురస్కారం అందుకోనున్న నటుడు ఎం.ఎస్.భాస్కర్. మొత్తంగా చెప్పాలంటే, ముత్తుపేట్టై సోము భాస్కర్. సోము భాస్కర్ అనేది ఆయన పేరు కాగా, ముత్తుపేట్టై ఆయన పుట్టిన ఊరు.

- విశీ (వి.సాయివంశీ)

ఇవాళ నటుడిగా అవకాశాలు పొందేందుకు చాలా మార్గాలున్నాయి. కానీ ముప్పై ఏళ్ల క్రితం సినిమాలు, నాటకాలు తప్ప మరో అవకాశం లేదు. సినిమాల్లో అవకాశం వచ్చినా నిలదొక్కుకోవడానికి చాలా కష్టపడాలి. భాస్కర్ నాటకరంగ కళాకారుడు. 'సొసైటీ ఫర్ న్యూ డ్రామా' అనే నాటక ట్రూప్‌లో సభ్యుడు. అనేక నాటకాల్లో నటించారు. ఆ ట్రూప్‌తోపాటు అనేక ఇతర ట్రూప్‌లలోనూ సభ్యుడిగా మారి నాటకాలు వేశారు. ఆ సమయంలో దర్శకుడు, నాటక రచయిత విసు కళ్లలో పడి సినిమా అవకాశం అందుకున్నారు. అయితే ఆయన ప్రయాణం అంత సులువుగా సాగలేదు. 1987లో ఆయన సినిమా కెరీర్ మొదలుపెడితే, 2004 వరకు భాస్కర్‌కి బ్రేక్ రాలేదు. 'ప్రధాన తారాగణం' అనే చోట ఆయన పేరు రాయడానికి సుమారు 20 ఏళ్ల కాలం పట్టింది. ఆ మధ్యలో ఆయన ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేశారు. టూత్‌పేస్ట్ కంపెనీలో పనిచేశారు.


2004లో 'ఎంగల్ అన్నా' (తెలుగులో జగపతిబాబు నటించిన 'ఖుషీఖుషీగా') సినిమాతో భాస్కర్‌కు బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత మెల్లగా ఆఫర్లు వరుస కట్టాయి. ప్రధానంగా కామెడీ వేషాలు ఆయన్ని నిలబెట్టాయి. తెలుగులో ధర్మవరపు సుబ్రహ్మణ్యం చేసినటువంటి పాత్రలు తమిళంలో భాస్కర్ చేసేవారు. అవన్నీ ఆయనకు పేరుతెచ్చాయి.

బ్రేక్ అయితే వచ్చింది. మరి గుర్తింపు 2007లో 'మొళి' (తెలుగులో 'మాటరాని మౌనమిది') అనే సినిమాతో ఆ గుర్తింపు వచ్చింది. కొడుకును కోల్పోయి, ఆ నిజాన్ని నమ్మలేక, షాక్‌తో పిచ్చిగా ప్రవర్తించే ప్రొఫెసర్ జ్ఞానప్రకాశం అనే పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా అవార్డు అందించింది. అప్పటిదాకా కామెడీ వేషాలతో ఆకట్టుకున్న ఆయన సీరియస్ పాత్రలకూ సూట్ అవుతారని అందరికీ తెలిసింది. గట్టి పాత్రలు రావడం మొదలైంది. కాలం గడుస్తూ ఉంది. 2017లో '8 బుల్లెట్స్' అనే తమిళ సినిమా వచ్చింది. అందులో ఉద్యోగం పోగొట్టుకున్న కానిస్టేబుల్ కృష్ణమూర్తి పాత్ర చేశారు భాస్కర్. తెలుగులో అదే సినిమా 'సేనాపతి'గా రీమేక్ చేసినప్పుడు ఆ పాత్రను రాజేంద్ర ప్రసాద్ చేశారు. అటు తమిళంలో, ఇటు తెలుగులో ఇద్దరూ తమ నటనతో అదరగొట్టారు. కొంత క్రౌర్యం, కొంత మంచితనం, మరికొంత గాంభీర్యం, ఇంకొంత నిస్సహాయత కలగలిసిన పాత్ర అది. భాస్కర్ ఇలాంటి పాత్ర కూడా చేయగలరా అని అందరూ ఆశ్చర్యపోయారు. ఆ ఆశ్చర్యపోయిన వారిలో రామ్‌కుమార్ బాలకృష్ణన్ కూడా ఉన్నారు. తాను తీసే 'పార్కింగ్' అనే సినిమాలో ప్రధాన పాత్రకు ఈయనే కరెక్ట్ అని అనుకున్నారు. అలా 2023లో ఆ సినిమాలో ఈవో 'ఇళంపరుతి' పాత్ర భాస్కర్‌కు దక్కింది. ఇంటి ముందు పార్కింగ్ విషయంలో గొడవపడి, పంతంతో కారు కొని, ఆ తర్వాత ఇబ్బందులు పడి, ఇంట్లోవారి చేత చెడ్డ అనిపించుకుంటున్నా తన పట్టువీడని ఇంటి పెద్ద పాత్రలో భాస్కర్ నటన అద్భుతం. ప్రేక్షకులు ఆ పాత్రకు చాలా కనెక్ట్ అయ్యారు. కొన్నిచోట్ల తిట్టుకున్నారు. మరికొన్నిచోట్ల అయ్యో అనుకున్నారు. ఆ పాత్ర మీద జాలినీ, కోపాన్నీ ఏకకాలంలో చూపించారు. జాతీయ అవార్డుల కమిటీకి ఆ నటన నచ్చింది. పురస్కారం ప్రకటించారు. భాస్కర్ దాదాపు 200కు పైగా సినిమాల్లో నటించారు. తెలుగులో 'గగనం', 'మూడు ముక్కల్లో చెప్పాలంటే' సినిమాల్లో నటించారు. అనేక తమిళ డబ్బింగ్ సినిమాల్లో ఆయన మనకు కనిపిస్తారు. వందల నాటకాల్లో నటించారు. రేడియో కార్యక్రమాలు చేశారు. టీవీ సీరియల్స్ చేశారు. వెబ్ సిరీస్‌లోనూ నటించారు. తమిళంలోకి డబ్బింగ్ అయిన తెలుగు సినిమాల్లో బ్రహ్మానందానికి శాశ్వత డబ్బింగ్ కళాకారుడు భాస్కరే. 'బొబ్బిలిరాజా' సినిమా నుంచి మొన్న మొన్న వచ్చిన 'ఖుషీ' దాకా అనేక తమిళ డబ్బింగ్ సినిమాల్లో బ్రహ్మానందం గొంతంటే ఎం.ఎస్.భాస్కర్‌దే. నటుడిగా చాలా బిజీగా ఉన్న సమయంలో కూడా బ్రహ్మానందం కోసం తమిళంలో తన గొంతు ఇచ్చి గౌరవించారు. భాస్కర్ కుమారుడు ఆదిత్య భాస్కర్ కూడా నటుడే. '96' సినిమాలో విజయ్ సేతుపతి చిన్నప్పటి పాత్ర పోషించింది అతనే.

**ఇప్పుడు భాస్కర్ వయసు 67 ఏళ్లు. ఆయన సినిమా కెరీర్ వయసు 37 ఏళ్లు. ఇన్నాళ్ల తర్వాత ఆయనకు జాతీయస్థాయి గౌరవం, గుర్తింపు దక్కింది. మంచి కళాకారులకు గుర్తింపు రావడం ఒక్కోసారి ఆలస్యం కావొచ్చు. కానీ తప్పకుండా దక్కుతుంది. అందుకు భాస్కర్ ఓ ఉదాహరణ.**




## మృణాల్ రుసరుసలు ఎందుకంటే..?



బాలీవుడ్ సీరియల్స్‌లో టాలెంట్ చూపించి అక్కడ నుంచి సిల్వర్ స్క్రీన్ ప్రమోట్ అయ్యింది మృణాల్ ఠాకూర్. హిందీలో సినిమాలు చేస్తూ ఒక మోస్తారు కెరీర్ కొనసాగిస్తున్న అమ్మడికి తెలుగు నుంచి సీతారామం ఆఫర్ రావడం అది ఆమె చేయడం ఆ సినిమా సూపర్ హిట్ అవ్వడం అంతా అలా జరిగింది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన సీతారామం సినిమాలో మృణాల్ ఠాకూర్ సీతామహాలక్ష్మి పాత్రలో అదరగొట్టేసింది. తెలుగులో ఎంట్రీ ఇవ్వడమే ఒక సూపర్ హిట్ పడటంతో అమ్మడు సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ప్రెజెంట్ అడివి శేష్‌తో డెకాయిట్ మూవీ చేస్తుంది మృణాల్ ఠాకూర్. రీసెంట్‌గా అజయ్ దేవగన్‌తో మృణాల్ ఠాకూర్ నటించిన సినిమా సన్ ఆఫ్ సర్దార్ 2. ఈ సినిమా లాస్ట్ వీక్ రిలీజైంది. సినిమాకు ఆశించిన రేంజ్‌లో పాజిటివ్ టాక్ రాలేదు. ఐతే సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఆఫ్టర్ రిలీజ్ మృణాల్ సోషల్ మీడియా ఫాలోవర్స్‌తో చిట్ చాట్ చేసింది. ఈ చాట్‌లో భాగంగా మృణాల్ ఒక వ్యక్తి మీ సినిమాకు వచ్చిన రివ్యూస్ చూసి సినిమా వెళ్దామనుకున్న వాడినే ఆగిపోయా అన్న కామెంట్ కనబడింది. సినిమా సూపర్ హిట్ అయితే రివ్యూస్ కూడా.. దానికి మృణాల్ ఆన్సర్ ఇస్తూ సినిమాను రివ్యూస్ మిస్ లీడ్ చేస్తాయని అన్నది. సినిమా ఎలా ఉంది అన్నది ఆడియన్స్ రివ్యూస్ చదివి కాదు చూసి డిసైడ్ చేయాలని అన్నది మృణాల్ ఠాకూర్. నెగిటివ్ రివ్యూస్ వల్లే సినిమాలు ఆడట్లేదని చెప్పడం ఏమాత్రం కరెక్ట్ కాదు. మృణాల్ ఠాకూర్ సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమా చాలా పర్సనల్ గా తీసుకున్నట్టు ఉంది. అందుకే ఆ సినిమా నెగిటివ్ రివ్యూస్ పై ఆమె రుసరుసలాడుతున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# నేతిబీర రాజకీయాలు.. నైతిక హక్కులు






**నైతిక హక్కు అనేది విచిత్రమైన పదార్థం. ఆ మాట అనడానికి, ఆ విషయం అడగడానికి నీకు నైతిక హక్కు లేదు అని అంటుంటారు. రాజ్యాంగంలో, చట్టాల్లో రాసుకున్న హక్కులకే గతిలేని స్థితిలో నైతికహక్కులను ఖాతరు చేసేదెవరు? మన సమాజంలో, ముఖ్యంగా నిర్ణాయక వ్యవస్థలకు అంత నైతికత, నీతి, భక్తి ఎక్కడ ఉన్నాయి? ఒక విషయం ఎవరో ఒకరు అడగడం ముఖ్యం కానీ, అడిగేవాడి యోగ్యతల గురించి పట్టింపు ఎవరికి? ఇవాళ తప్పు చేసినవాడే రేపు ప్రశ్నిస్తాడు. నిన్న ప్రశ్నించినవాడే ఇప్పుడు తప్పు చేస్తున్నాడు.**

ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవలసిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అక్టోబర్ 31లోగా నిర్ణయం తీసుకోవాలి. ఫిరాయింపుదారుల మీద ఇక అనర్హత వేటు తప్పదని, ఉప ఎన్నికలు వస్తాయని ప్రతిపక్షం ఆశపడుతోంది. అంతేకాదు, ఇదొక గొప్ప విజయంగా సంబరపడుతోంది. ఫిరాయింపులను ప్రోత్సహించడంలో ఆరితేరిన పార్టీకి సుప్రీంకోర్టు తీర్పు మీద మాట్లాడే నైతికహక్కు లేదని పాలకపక్షం తీసిపారేస్తోంది. ఆశ్చర్యకరంగా సామాన్య ప్రజలు కూడా ఈ అంశాన్ని అధికార, ప్రతిపక్షాల మధ్య తగాదాగా చూస్తున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు అనర్హులైనా, కాంగ్రెస్ ప్రభుత్వానికి మెజారిటీ లోటేమీ రాదు కానీ, రేవంత్ బృందబలం తగ్గిపోవచ్చు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవలేకపోతే, కప్పల తక్కెడ బీఆర్ఎస్ వైపు మొగ్గవచ్చు. నైతిక హక్కులు లేకపోయినా, నైతిక విజయాలు, నైతిక పరాజయాలు రాజకీయ పరిణామాలలో ప్రభావం చూపిస్తాయి కాబట్టి, అధికారంలో ఉన్న ప్రభుత్వానికి అది నష్టం కలిగిస్తుంది. పరిశీలకులైనా, విశ్లేషకులైనా, రాజకీయాసక్త సామాన్యులైనా ఈ లెక్కలు వేసుకోవడమే తప్ప, ప్రజాస్వామ్యానికి, కలిగే నష్టం గురించి ఆలోచించకపోవడమే ఇక్కడ విషాదం.

రాజకీయాలలో నైతికతను ఒక రాజ్యాంగ విలువగా తీసుకురావడం కోసమే పదో షెడ్యూలు కింద ఫిరాయింపుల చట్టం అవతరించింది. జనతా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆ తర్వాత కాంగ్రెస్ తిరిగి గెలిచిన సందర్భంలోను జరిగిన ఫిరాయింపుల మీద ప్రజల్లో ఏవగింపు పెరిగింది. తిరుగులేని మెజారిటీ సాధించిన ధీమాలోనే రాజీవ్‌గాంధీ హయాంలో ఫిరాయింపుల చట్టం వచ్చింది. ఆనాటి నుంచి దాన్ని నిర్వీర్యం చేసి, పక్కదారులు వెదకడంలోనే రాజకీయ పక్షాలు నిమగ్నమయ్యాయి. జాతీయ చట్టసభల దగ్గర నుంచి స్థానిక సంస్థల దాకా, ప్రజాభీష్టాన్ని అపహరించడానికి, తారుమారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికైన ప్రజాప్రతినిధి పార్టీ ఫిరాయింపు చేయడం అంటే, పార్టీ విధేయతను అతిక్రమించడం మాత్రమే కాదు. ప్రజలు కట్టబెట్టిన ఆమోదాన్ని గంపగుత్తగా, ఆ ఆమోదానికి వ్యతిరేకంగా బదలాయించడం. అటువంటి సందర్భాల్లో ప్రజలకు దాన్ని అడ్డుకోవడానికి చట్టపరమైన ఆస్కారమే లేదు.

పార్టీ మారినప్పుడు, పార్టీ పేరుతో సాధించుకున్న స్థానాన్ని వదులుకోవాలన్నది ఒక కనీస విలువ. 2023 తెలంగాణ ఎన్నికల్లో ప్రజలు ఒక తీర్పు ఇచ్చారు. బీఆర్ఎస్‌ను ప్రతిపక్ష స్థానంలో కూర్చోమని చెప్పి, గణనీయమైన సంఖ్యలోనే విజయాలు కూడా ఇచ్చారు. కానీ, కొందరు సభ్యులు తమ ప్రయోజనాలకు ఆ తీర్పు భంగకరమని, అధికారానికి దూరంగా ఉండలేమని భావించి, రకరకాల పద్ధతులలో గోడదూకారు. సాంకేతికంగా ఒక పార్టీలో ఉంటూనే, దానికి వ్యతిరేకంగా, మరో పార్టీకి అనుకూలంగా మాట్లాడారు. ఫిరాయించిన పార్టీ నుంచి రకరకాల పద్ధతుల్లో ప్రయోజనాలు తీసుకున్నారు. దీనికి అధికార పార్టీ ప్రోత్సాహం ఎంత కారణమో, అంతకు ఎక్కువగా ఫిరాయింపుదారుల అనైతికత కూడా కారణం.

ఇటువంటి పనులే గతంలో రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్, చంద్రశేఖరరావు హయాంలో బీఆర్ఎస్ చేయలేదా అంటే చేశాయి. అప్పటి ప్రతిపక్షాలు దాన్ని ఖండించాయి కూడా. స్పీకర్ల సాచివేతను వ్యతిరేకించాయి. న్యాయస్థానాలను ఆశ్రయించాయి. కానీ, అప్పుడు ఎటువంటి నిర్ణయాత్మకమైన ఫలితాలూ రాలేదు. అది విచారకరమే. ఇప్పుడు సుప్రీంకోర్టు పట్టింపు చూపింది. కేవలం తెలంగాణ సందర్భంలోనే కాదు, మొత్తంగా ఫిరాయింపుల సమస్య, స్పీకర్ల పాత్ర విషయంలోనే సూచనలు చేసింది. సభ్యుల అనర్హత వంటి సున్నితమైన, కీలకమైన విషయాల్లో స్పీకర్‌కు నిర్ణయాత్మకత ఉండడం సబబు కాదేమోనని, ట్రిబ్యునల్ వంటి ప్రత్యామ్నాయ స్వతంత్ర వ్యవస్థ ఏర్పాటు గురించి ఆలోచించాలని పార్లమెంటుకు సూచించింది. గత రెండు లోక్‌సభల్లో అధికార పార్టీకి భద్రమైన బలం ఉన్నప్పుడు ఈ తీర్పు వచ్చివుంటే, సుప్రీంకోర్టు సూచనను అమలుచేసి ఆ ఘనతను చాటుకునే వారేమో కానీ, ఇప్పుడైతే ఆ అవకాశం లేదు. దేశంలో అధికారంలో ఉన్న పార్టీ గతంలో కర్ణాటకలో, మహారాష్ట్రలో ఎటువంటి పద్ధతులు అనుసరించిందో అందరికీ తెలిసిందే.

చట్టసభలకు, న్యాయస్థానాలకు సభావివాదాల పరిధుల విషయంలో ఒక స్పర్థ నడుస్తూ ఉంది. చట్టసభలు చేసిన నిర్ణయాలకు న్యాయస్థానాలు అడ్డు తగులుతున్నాయని రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు సైతం బాహాటంగానే ప్రచారాలు చేస్తున్నారు. తమిళనాడు బిల్లుల ఆమోదం విషయంలో సుప్రీం కోర్టు చేసిన నిర్ణయం మీద కేంద్రం తీవ్రమైన అసహనాన్ని రకరకాల పద్ధతులలో వ్యక్తం చేసింది. వివిధ రాజ్యాంగ వ్యవస్థల సరిహద్దుల విషయంలో జాగ్రత్తగా ఉండవలసి వస్తోందన్న అర్థంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా ఇటీవల వ్యాఖ్యానించారు. రాజ్యాంగ మౌలిక చట్రానికి భంగం కలిగే సవరణలకు వీలులేదన్న కేశవానంద భారతి తీర్పు మీద కూడా ప్రతికూల ప్రచారం జరుగుతూ వస్తోంది. వివిధ వ్యవస్థల మధ్య ఒక సమతూకం, పరస్పర కట్టడి ఉండేట్టుగా రాజ్యాంగ నిర్మాతలు జాగ్రత్త పడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకునే చట్టసభలకే అత్యున్నత పరిగణన ఉండాలన్నది నిజమే అయినప్పటికీ, చట్టాలు, పరిపాలన రాజ్యాంగ నిర్దేశించిన విధివిధానాలకే లోబడి ఉండాలనేది కూడా ప్రజాస్వామ్య సంప్రదాయంగా ప్రపంచ వ్యాప్తంగా సుస్థాపితమైంది. న్యాయస్థానాల స్వతంత్రత ఏపాటిదన్న ప్రశ్న ప్రజల్లోనూ వస్తోంది. స్వతంత్రంగా వ్యవహరించగలిగే అవకాశాలను తగ్గించడానికి న్యాయమూర్తుల నైతికతను ప్రశ్నార్థకం చేసే ప్రయత్నాలూ, ఇతరత్రా జరుగుతున్నాయి. ఎంతగా నిరుత్సాహపరుస్తున్నప్పటికీ, ఇప్పటికీ బాధితులకు అంతిమ ఆశ్రయంగా న్యాయవ్యవస్థే ఉన్నదన్నది వాస్తవం. న్యాయవ్యవస్థలో నియామకాలు, అమెరికాలో జరుగుతున్న మాదిరిగా పార్టీల అనుకూలతల ఆధారంగా జరగకూడదని, ఒక పారదర్శక వ్యవస్థ ఉండాలని, అటువంటి ప్రక్రియలో ఎంపికైన న్యాయమూర్తులు న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవడానికి స్థిరనిశ్చయంతో పనిచేయాలని ప్రజాస్వామికవాదులు ఆశిస్తారు. ఫిరాయింపుల చట్టం స్ఫూర్తిని సభాపతులే గౌరవించనప్పుడు, ఫిర్యాదు చేయగలిగే వ్యవస్థ కూడా ఒకటి ఉండాలి. దశాబ్దాల పాటు అపరిష్కృతంగా ఉన్న 'సభాపతి విచక్షణ' సమస్యకు, కనీసం రాష్ట్ర చట్టసభల విషయంలో అయినా ఇప్పుడు ఒక చొరవ కనిపించింది.

దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ రెండు పార్టీలు లేదా కూటములు వంతులవారీగా అధికారంలోకి వస్తుంటాయి. ఎవరు అధికారంలో ఉంటే వారు అవతలి పక్షం నుంచి ఫిరాయింపులను ప్రోత్సహిస్తుంటారు. వారు ప్రతిపక్షంలోకి రాగానే, అధికారపక్షం ఫిరాయింపులను విమర్శిస్తుంటారు. ఇందులో ఏ పక్షానికీ నైతికహక్కులు, నైతికతా లేని మాట నిజమే. కానీ, ప్రజలకు గత్యంతరమేమిటి? కాంగ్రెస్ ప్రోత్సహించిన ఫిరాయింపులను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదంటే, ఆ అప్రజాస్వామికత మీద గొంతెత్తగలిగే బలమైన పక్షం అయితే ఒకటి ఉండాలి కదా? వాళ్లకు చిత్తశుద్ధి లేదు నిజమే కానీ, మాటవరసకో, రాజకీయ పోరాటంలో భాగంగానో ఒకరిపై ఒకరు పోరాడుతుంటే.. అందులోనే ప్రజల ప్రయోజనాలు కూడా కలగలసి ఉంటాయి కదా? ఒక పార్టీ అధికార శక్తితో చెడ్డపనులు చేస్తుంటే, మరోపార్టీ తన గత చరిత్ర కారణంగా నోరెత్తకుండా ఉంటే, ఇక నిష్కృతి ఏది? 'ఉపా' గురించి దాని సృష్టికర్త కాంగ్రెస్ పార్టీ మాట్లాడవద్దంటే, బాధితులకు ఇక ఆలంబన ఏముంటుంది? వాళ్ల ద్వంద్వత్వాన్ని లేదా నైతికరాహిత్యాన్ని ఆయా పక్షాలవారు ఎట్లా సమర్థించుకుంటాయో, ఆత్మవంచన చేసుకుంటాయో వారిష్టం. పెదవులపై నుంచో, మనసులో నుంచో ఒక ప్రజాస్వామిక వ్యక్తీకరణ చేసేవారుండడం మాత్రం అవసరం. మొత్తంగా రాజకీయ వ్యవస్థ అంతా కూడబలుక్కుని ఫిరాయింపులను నిరోధించే చట్టవ్యవస్థను నీరుగారుస్తోంది. అది వాస్తవం. ఇప్పుడు మూడునెలల గడువులోపు నిర్ణయం వస్తుందో లేదో తెలియదు. న్యాయస్థానాల అధికార పరిధిని సభాపతులు ఇప్పుడు కూడా ప్రశ్నించి, ఒక సుదీర్ఘ వివాదానికి తెరతీయవచ్చు. లేదా, నిర్ణయం తీసుకోమన్నారు కానీ, ఆ నిర్ణయం అనర్హత వేటు మాత్రమే కానక్కరలేదు కదా, అనర్హతల అభ్యర్థనను తిరస్కరిస్తూ కూడా నిర్ణయం రావచ్చు, తిరిగి ఆ నిర్ణయం ఉన్నత న్యాయస్థానం సమీక్షకు వెళ్లవచ్చు. కానీ, ఈ విషయాన్ని ఒక కొలిక్కి తెచ్చి, ఒక సత్సంప్రదాయాన్ని నెలకొల్పాలని అందరూ అనుకుంటే, అందుకు అనుగుణమైన నిర్ణయం రావచ్చు. ఒక పార్టీకి రాజకీయ ఆయుధంగా, మరో పార్టీకి రాజకీయ నష్టంగా మాత్రమే ఈ సంచలన తీర్పును చూడడం ఒక పద్ధతి. రాజకీయాలలో విలువలను, నీతిని ఆశించడం ప్రజల ప్రజాస్వామిక హక్కు, నైతిక హక్కు అని గుర్తించి సానుకూల పరిణామంగా చూడడం మరో పద్ధతి.



కె.శ్రీనివాస్

## 6నుంచి పరమవీరచక్ర కార్యక్రమం

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంగా ఈనెల 6 నుంచి ప్రతి బుధవారం ఉదయం 7 గంటల 20 నిమిషాలకు "పరమ వీర చక్ర " శీర్షికన ప్రసంగ ధారావాహికను ప్రసారమవుతుందని కార్యక్రమ విభాగాధిపతి కె. ఇందిర తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు పరమ వీరచక్ర అవార్డు పొందిన 21 మంది సైనిక వీరుల జీవితాలను, వారి ధైర్య సాహసాలను, త్యాగ నిరతినీ, పోరాట స్ఫూర్తిని శ్రోతలకు అందించాలనే సంకల్పంతో 21 భాగాలుగా ఈ ధారావాహికను రూపొందించి ప్రసారం చేస్తున్నామన్నారు. భారతదేశ త్రివిధ దళాలలో పనిచేస్తున్న అధికారులు, రిటైర్ అయిన మాజీ సైనిక అధికారుల ప్రసంగాలు ఈ ధారావాహికలో ప్రసారం అవుతాయని ట్రాన్స్మిషన్ ఎగ్జిక్యూటివ్ టి.దిలీప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పరమవీరచక్ర ధారావాహికని ఆకాశవాణి విశాఖపట్నంతోపాటు ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రానికి అనుబంధంగా ఉన్న కేంద్రాల్లో కూడా ప్రసారమవుతాయన్నారు. newsonair app ద్వారా కూడా ప్రపంచ వ్యాప్తంగా ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర ప్రసారాలు శ్రోతలు వినవచ్చన్నారు.



తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నగరంలోని బాదుళ్లపేట అంగన్‌వాడ కేంద్రంలో మంగళవారం డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ గంగు రమణారావు ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, పాలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, సహాయకురాలు తదితరులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం

## స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించండి

(సత్యంన్యూస్, టెక్కలి)

విద్యుత్ వినియోగదారులకు డిస్కంలు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక, ప్రజాసంఘాలు డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అదాని స్మార్ట్ మీటర్లు వద్దు-ట్రూఅప్ చార్జీలు రద్దు అనే అంశంపై "ప్రజాసదస్సు" పిలుపులో భాగంగా టెక్కలిలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నంబూరు షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు, ఉర్జాన లక్ష్మణరావు, జోగి కుమార్, బగాది వాసుదేవరావు, జి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




# తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అమ్మపాలు బిడ్డకు రక్ష, తల్లికి శ్రీరామ రక్ష అని, బిడ్డకు అమ్మపాలను మించిన ఔషధం లేదని ప్రముఖవైద్యులు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర మంగళవారం అన్నారు. స్థానిక సింధూర హాస్పిటల్ ఆవరణలో, లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగముగా ప్రముఖ వైద్యులు డా.మాలతి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ అమ్మపాలను మించి ఆహారం లేదని, బిడ్డకు అమ్మ పాలు ఎంత శ్రేష్టమో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించటం హర్షణీయమన్నారు. అమ్మపాలు బిడ్డకు ఓ వరమని, అత్యంత సురక్షితమే కాకుండా మంచి పౌష్టికాహారం లభిస్తుందన్నారు. తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా, వ్యాధుల్ని జయిస్తారని, అమ్మపాలు తాగే శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో రోగనిరోధక శక్తిని పొందుతారన్నారు. డాక్టర్ పైడి సింధూర మాట్లాడుతూ ముర్రుపాలు ఎప్పుడు పట్టాలి, అవి ఎంత శ్రేష్టం, ఇలా చాలా అంశాలపై అవగాహన కల్పించటానికే ఈ తల్లిపాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి 6నెలల వరకు తల్లిపాలు తప్ప మరేమీ ఇవ్వకూడదని, తల్లి పాలు తేలికగా జీర్ణమవుతాయని, శుభ్రంగా ఎటువంటి క్రిములు సోకకుండా, శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయన్నారు. తల్లి దగ్గర పాలు పుష్కలంగా ఉంటే బిడ్డకు రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టవచ్చని, అమ్మపాల వల్ల బిడ్డకు ఎటువంటి వ్యాధులు దరిచేరకుండా బిడ్డ ఆరోగ్య ఎదుగుదల సహాయపడతాయన్నారు. తల్లిపాలను బిడ్డ ఎంత వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి, రోజుకు ఎన్నిసార్లు పట్టాలి, ఎలా పట్టాలి, తల్లిపాలు పుష్కలంగా ఉండాలంటే, తల్లి ఏం తినాలి, ముర్రుపాలు ఎప్పుడు పట్టాలి, పాలిచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు అంశాలపై గర్భిణీలకు, బాలింతలకు అవగాహన కల్పించి, పౌష్టికాహార సూచనలను అందించారు. కార్యక్రమంలో పొన్నాడ రవికుమార్ నటుకుల మోహన్, టెక్కం రాంగోపాల్, బి.దేవభూషణం, బోగెల ఉమామహేశ్వర రావు, బి. మాధురి, అడపా శాంతి, ఎన్.రమ్య, బి.వరలక్ష్మి, బాలింతలు, గర్భిణీలకు, సింధూర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

(సత్యంన్యూస్, సీతంపేట)



ఈనెల 9న ప్రపంచ ఆది వాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని సీతంపేట, ఐటిడిఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఐటీడీఏ పరిధిలోని నాలుగు మండలాల గిరిజన ప్రజలతో సీతంపేట ఐటిడిఏ లోని ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడి యంలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు ప్రపంచ ఆది వాసీ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. అదే విధంగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి సీతంపేట ఐటిడిఏ పరిధిలో ఉన్న 16 మండలాల గిరిజన ప్రజలతో పాతపట్నంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఆగస్ట్ 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీవో తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ పండుగను గిరిజన ఆచార, సాంప్రదాయాలు, గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా నిర్వహిస్తామని తెలిపారు. గిరిజన కళాకారులతో గిరిజన నృత్యాలను, గిరిజన వేషధారణలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కావున సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవో కోరారు.

అదే విధంగా పాతపట్నంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఐటిడిఏ పరిధిలోగల 16 మండలాలకు చెందిన గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవో కోరారు.















# ఇచ్చిన మాట నిలబెట్టుకోండి

(సత్యంన్యూస్, రణస్థలం)

తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్ల వ్యవస్థను రద్దు చేస్తామని కూటమి నాయకులు అప్పట్లో హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ మాటను నిలబెట్టుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు, సిపిఎం రణస్థలం శాఖ కార్యదర్శి వెలమల.రమణ డిమాండ్ చేసారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజావేదిక రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా రణస్థలం విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్‌మీటర్లు బద్దలుకొట్టండి అని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజలను మోసం చేయడం అని వారు అన్నారు. స్మార్ట్ మీటర్లు ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. టైం ఆఫ్ ది డే విధానం పేరుతో పగలు ఒక రేటు రాత్రి ఒక రేటు, సాయంత్రం 6 గంటల నుండి 10 గంటల వరకు మరొక రేటు ఉంటుందని వారు తెలిపారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం కూటమి కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రైవేటీకరణకు ఇది ఒక మెట్టు అని దీని పేరే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ అని అన్నారు. సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకోవాలన్నారు. అప్పుడే కరెంటు వస్తుంది. ముందు రూ.500 తగ్గకుండా బ్యాలెన్స్ వేయించుకోవాలి. బ్యాలెన్స్ అయిపోగానే మళ్ళీ డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకోవాలన్నారు. లేనియెడల కరెంటు నిలిచిపోతుందని, చీకటే గతి అని అన్నారు. ప్రజల కళ్ళు కప్పి 93 నెలలలో వాయిదాల పద్ధతిలో కరెంటు బిల్లుతో పాటు వసూలు చేస్తారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై 23 వేల కోట్ల రూపాయలు భారం వేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డి.మహాలక్ష్మి నాయుడు, వి.లక్ష్మి, ఎమ్.రాము, డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221



నియోజకవర్గంలోని ఎల్.యన్.పేట మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ పాలక కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కాగాన మన్మధరావు, డైరెక్టర్లు యరబాటి రాంబాబు, కొయ్యాన శ్రీనులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, పాతపట్నం



ఎచ్చెర్ల ఆర్మ్ రిజర్వ్ విభాగంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్‌గా ఎన్ శంకర్ ప్రసాద్, బాధ్య తలు చేపట్టిన అనంతరం మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.
- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# ఆంగ్ల అధ్యాపకుడి వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో గల జి.సిగడం మోడల్ స్కూల్ ఆంగ్ల అధ్యాపకుడు డిహెచ్ సుబ్రహ్మణ్యం మరోసారి విద్యార్థుల పట్ల తనకున్న అంకిత భావాన్ని, వితరణ స్వభావాన్ని చాటుకున్నారు. 2025 మార్చి నెలలో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఆంగ్లంలో 90 మార్కులకు పైబడి అత్యధిక మార్కులు సాధించిన 33మంది మొదటి సంవత్సరం విద్యార్థులలో 94 మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులకు వారి కోరిక మేరకు ఐఐటీ, జేఈఈ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలకు సంబంధించిన సుమారు రూ.5వేల విలువచేసే పోటీ పరీక్షల పుస్తకాలను మంగళవారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ గణేష్ పట్నాయక్, సహచర సిబ్బంది చేతుల మీదుగా అందజేశారు. అంతేకాకుండా గత మూడు సంవత్సరాలుగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధిస్తూ, అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్న ఆంగ్ల అధ్యాపకుడు సుబ్రహ్మణ్యంను ప్రిన్సిపల్ మరియు సిబ్బంది అభినందించారు.



# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆముదాలవలస శాఖ ప్రతినిధులు కోరారు. మంగళవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతిపత్రం అందించారు. ముందుగా సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అడ్డగోలు నిబంధనలతో అక్రిడేషన్ల సంఖ్యను సగానికి సగం కుదించిందని తెలిపారు. పాత అక్రిడేషన్లు గడువును పదేపదే పొడిగిస్తూ కొత్త అక్రిడేషన్లు ఇవ్వకుండా గత ప్రభుత్వం జర్నలిస్టులను తీవ్రంగా వేధించిందన్నారు. దీంతో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ ఆగిపోవడమే కాకుండా హెల్త్‌కార్డు పొందే అవకాశాన్ని కూడా కోల్పోయారన్నారు. రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌కార్డు పథకంలోని లోటుపాట్లను సవరించి మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలు నియామకాలను సవరించి పని చేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడేషన్లు గడువు ఆగస్టు 31వ తేదీ నుండి పూర్తి కానుందన్నారు. మరోసారి గడువు పొడిగించకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డు అందించాలని కోరారు. విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛన్ పథకాన్ని మన రా ష్ట్రంలో కూడా ప్రారంభించాలని, రాష్ట్ర జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలో జర్నలిస్టు యూనియన్లకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. పాత అక్రిడేషన్ కార్డులు గడువు పొడిగించకుండా పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్ కార్డులు వెంటనే అందించాలన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని కోరుతూ ఎమ్మార్వో రాంబాబుకు గురుగుబెల్లి ప్రసాదరావు, తమ్మినేని వాసుదేవరావు, జి.చిరంజీవి, తాంద్ర అప్పలనాయుడు, కె.వి.రమణ, ఎస్పీ రాహుల్, చంటి, కె.ఢిల్లేశ్వరరావు, అన్నెపు రమేష్‌లు వినతి పత్రం అందించారు.



# జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల డిమాండ్స్ డే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఏపీడబ్ల్యూజే పిలుపు మేరకు మంగళవారం "జర్నలిస్టుల డిమాండ్స్ డే" నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు, పాత్రికేయులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అధికారులకు అందజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి పద్మావతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి హెచ్ జగదీష్, సనపల రమేష్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు పైడి బాలకృష్ణ, మొదలవలస వాసులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసందానంగా ఉంటూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా పని చేస్తున్న పాత్రికేయులు ఈ సమాజంలో తీవ్ర అన్యాయానికి గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ల తేదీ పొడిగింపు వల్ల చాలామందికి అన్యాయం జరిగిందని, నిబంధనలు సడలింపులేక ఎంతోమంది ఆరోగ్యశ్రీ పథకానికి నోచుకోలేదన్నారు. ఉన్నవారికి కూడా సక్రమంగా అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ, హెల్త్‌కేర్ ట్రస్ట్, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులతో రాష్ట్రస్థాయిలో ఒక కమిటీ వేయాలని కోరారు. అధికారానికి రాకముందు ప్రమాద భీమా, ఇళ్ల స్థలాలు మంజూరు వంటి సదుపాయాలు కల్పిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయని, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లు సమాజానికి సేవలందించిన జర్నలిస్టులు శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపడానికి అనుభవం, వయసు ప్రాతిపదికన పింఛన్లు మంజూరు చేయాలని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఇస్తున్నారని తెలిపారు. ఇళ్లస్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంచు చిన్నారావు, గరిమెళ్ళ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి, కోశాధికారిలు ఎస్.చైతన్య, చౌదరి సత్యనారాయణ, సామ్నా అధ్యక్షులు సున్నపు చిన్నారావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లా లోని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, ఆముదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గ కేంద్రాల్లోనూ, రణస్థలం, పొందూరు, సరుబుజ్జిలి, మెలియాపుట్టి, మందస, సోంపేట, కమిటీ, కోటబొమ్మాళి మండల కేంద్రాల్లో తాసిల్దారులను, ఆర్డీఓ లను కలిసి తమ డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అయ్యేదానికి కృషి చేయాలని కోరారు.

## మారుమూల గ్రామం నుంచి మేనేజ్‌మెంట్ ట్రెయినీగా

✔ ఇసకలపాలెం యువకుడి విజయం



(సత్యంన్యూస్, సోంపేట)

మారుమూల గ్రామం.. అదీ నిరక్షరాస్యులు అధికంగా ఉండే మత్స్యకార పల్లె నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగానికి ఎంపిక కావడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. సోంపేట మండలంలోని శివారు గ్రామమైన ఇసుకలపాలేనికి ఒక యువకుడు ఇప్పుడు అటువంటి అరుదైన ఘనతనే సాధించాడు. గ్రామానికి చెందిన తెరిపల్లి భాస్కరరావు, కాంతమ్మ దంపతులు కుమారుడైన తెరిపల్లి బాలకృష్ణ నవరత్న హోదా ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్ఎఫ్ఎల్)కు చెందిన కెమికల్ విభాగంలో మెనేజ్‌మెంట్ ట్రెయినీగా నియమితులయ్యాడు. దాంతో కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వగ్రామంలోనే పాఠశాల విద్య చదువుకున్న బాలకృష్ణ అనంతరం నూజివీడు ట్రిపుల్ ఐటీలో బీటెక్(కెమికల్) చేశారు. విజయవాడలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో పని చేస్తున్న ఆయన ఫెర్టిలైజర్ కార్పొరేషన్‌లో నియామక పరీక్షలకు కష్టపడి ప్రిపేర్ అయ్యి విజయం సాధించాడు.

## కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం..!

(మొదటిపేజీ తరువాయి)



అంటోంది. వైద్యులకు సహకరించకుండా మొండిగా వ్యవహరిస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ధనలక్ష్మీని మునగవలస చౌకధరల దుకాణం డీలర్‌గా తొలగించారన్న ఆవేదనతోనే ఆత్యహత్యకు ప్రయత్నించినట్లు విశ్వసనీయ సమాచారం. తొలగించిన డీలర్‌షిప్‌ను పునరుద్ధరించాలని ఏడాదిన్నర కాలంగా ప్రతి వారం గ్రీవెన్స్‌కు వచ్చి ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నట్లు తెలిసింది. డీలర్‌గా తొలగించడాన్ని న్యాయస్థానంలోనూ ధనలక్ష్మీ సవాల్ చేసినట్లు తెలిసింది. ఆమదాలవలస రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రం వల్లనే డీలర్‌షిప్ పోయిందని ఆమె ఆరోపిస్తుంది. హైకోర్టులో ధనలక్ష్మీ వేసిన కేసుపై సోమవారం జిల్లా అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. ఈ వ్యవహారం కోర్టులో నడుస్తుండగానే ధనలక్ష్మీ కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు యత్నించడం సర్వత్రా చర్చనీయాంశం అయింది.

# లోపాల రీసర్వేతో పాపాల ప్లాన్!



(మొదటిపేజీ తరువాయి)

నిర్మించారు. అలాగే ఆదివారంపేట నుంచి కొత్తరోడ్డుకు వెళ్లే వరకు చెత్తను పోగేస్తే.. నగరం నుంచి వెళ్లి వచ్చేవారికి దుర్గంధమే స్వాగతం పలుకుతుందన్న ఉద్దేశంతో కంపోస్ట్ యార్డును వేరేచోటకు తరలించారు. ఆదివారంపేట అవతల చెత్తలు పడవేసే స్థలం భవిష్యత్తులో కోట్లు పలుకుతుందని బహుశా అప్పట్లో ఎవరూ ఊహించి ఉండరు. అక్కడ చెత్త ఉన్నంతవరకు 'మా స్థలంలో' చెత్తలేయడానికి మీరెవరంటూ ప్రశ్నించడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పుడు అక్కడ చెత్త క్లియరైపోయి స్థలం చదునుగా, అనువుగా కనిపించేసరికి అది ఒక భూమిలా కాకుండా కోట్ల రూపాయల కరెన్సీ కట్టలు పరిచిన ఓ ప్లాట్‌ఫామ్ మాదిరిగా అందరికీ కనిపిస్తోంది. అందుకే కొంతమంది కుమ్మక్కై ఆ స్థలాన్ని చేజిక్కించుకోవడానికి కొన్నేళ్లుగా చేయని ప్రయత్నం లేదు. విచిత్రమేమిటంటే.. వైకాపా హయాంలో ఆ పార్టీ కార్యకర్తలుగానో, సానుభూతిపరులుగానో సేవలందించినవారే తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ స్థలాన్ని కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

### పరస్పర విరుద్ధ ఆదేశాలు

బలగ ఆదివారంపేట దాటిన తర్వాత ఎడమవైపు నాగావళి కరకట్టకు ఆనుకొని ఉన్న స్థలం తమదేనని, ఇంతవరకు పొజిషన్‌లో ఉన్నది తామేనని.. దాని మీద హక్కుపత్రాలు తమకు ఇవ్వాలంటూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది తర్వాత మళ్లీ ఆ నలుగురూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వైకాపా హయాంలో ధర్మాన ప్రసాదరావు రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు ఆ స్థలంలో జెండా పాతేందుకు ప్రయత్నించింది కూడా వారే. అయితే అప్పటి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రికార్డులు తెప్పించుకుని భూమి స్వరూపాన్ని తెలుసుకుని.. అది ప్రభుత్వ భూమేనంటూ బోర్డులు పాతించారు. రెవెన్యూ మంత్రి చెప్పినా మా పని చేయరా? అని భావించిన ఆ నలుగురూ వైకాపా హయాంలోనే తమదని చెబుతున్న స్థలంలో కంచె వేసేశారు. దాన్ని తొలగించాలని కలెక్టర్, అలాగే ఉంచాలని అప్పటి రెవెన్యూ మంత్రి పేషీ పరస్పర విరుద్ధ ఆదేశాలివ్వడంతో ఏం చేయాలో తెలియక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సెలవుపై వెళ్లిపోయారు. ఈలోగా ఎన్నికలు, కలెక్టర్ మారడంతో అది నిలిచిపోయింది. ప్రభుత్వం మారిన ఏడాది తర్వాత ఇప్పుడు ఆ నలుగురూ ఆ భూమిపై హక్కుపత్రాలు ఇవ్వాలంటూ తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నారు.

### రీసర్వే చెప్పిందట!

ఒకసారి అది ప్రభుత్వ భూమి అని నిర్ధారించి బోర్డులు సైతం పెట్టిన తర్వాత ఇప్పుడు కొత్తగా హక్కులు ఎక్కడినుంచి పుట్టుకొచ్చాయని ఆరా తీస్తే.. బ్రిటీషర్ల తర్వాత తామే చేస్తున్నామని గత ప్రభుత్వం సగర్వంగా చెప్పుకున్న భూముల రీసర్వేయే దీనికి కారణమని తేలింది. నాడు పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం జిల్లాను ఎంచుకొని రీసర్వే చేసి అనేక ప్రభుత్వ భూములను, దేవదాయ శాఖ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. జిరాయితీ భూములను సైతం వేరే వారికి ధారాదత్తం చేసేశారు. అసలు రీసర్వేయే తప్పులతడక మహాప్రభో.. అంటూ జనం గగ్గోలుపెడుతుంటే ఇప్పుడు దాన్ని ఆధారంగా చేసుకొని కోట్లు విలువ చేసే భూమిని తమకు తాంబూలంలో పెట్టి ఇచ్చేయమని ఆ నలుగురు అడుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీసర్వేలో జరిగిన లోపాలను సవరిస్తామంటూ సచివాలయాల పరిధిలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. అక్కడ అందిన ఫిర్యాదుల పరిష్కారానికి ఇంతవరకు దిక్కూమొక్కూ లేదు. అటువంటిది కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రీసర్వేలో తమ పేరుతో చూపించారని, అందుకే తమకు హక్కుపత్రాలు ఇవ్వాలంటూ వీరు కోరడం విడ్డూరం.

✴రెవెన్యూ రికార్డుల్లో బలగ సర్వే నెంబర్-1లో ఉన్న భూమిని ఐదు సబ్ డివిజన్లు చేసి వారసత్వంగా వచ్చినట్టు ఎస్ఎల్ఆర్‌లో చూపించారు. ✴ఎస్ఎల్ఆర్‌లో పేర్కొన్న వివరాలకు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన వివరాలకు పొంతన కుదరడం లేదు. ✴రెవెన్యూ రికార్డుల ప్రకారం 1.05 ఎకరాల్లో కోనేరు ఉండాలి. కానీ అక్కడ కోనేరు జాడే లేదు. వీరు మాత్రం కోనేరుగా రికార్డుల్లో ఉన్న భూమి మెట్టుభూమిగా చెబుతున్నారు. ✴2023 ఆగస్టులో శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తీర్ణానికి ప్రభుత్వం నిర్ణయించడంతో దానికి ఆనుకుని ఉన్న నాగావళి వరద గట్టు భూమి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అప్పటి వరకు కనిపించని వారసులు, కొనుగోలుదారులు అకస్మాత్తుగా తెరమీదకు వచ్చారు.

# కదలడు.. వదలడు!

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పని చేసిన సీటులో సీతంపేట ఏజెన్సీ ప్రాంతం నుంచి వేరే ఉద్యోగి వచ్చి చేరాల్సి ఉంది. కానీ ఏజెన్సీ ప్రాంతానికి వర్తించే నిబంధనల ప్రకారం అక్కడ కొత్త ఉద్యోగి వచ్చి చేరే వరకు బదిలీ అయిన ఉద్యోగిని రిలీవ్ చేయడానికి లేదు. ఆ మేరకు కొత్త ఉద్యోగి రాకపోవడంతో అక్కడి నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయంలోని ఉదయ్‌కుమార్ సీటులో చేరాల్సిన ఉద్యోగి రాలేదు. మైదాన ప్రాంతాలకు ఈ నిబంధన వర్తించదు. తన స్థానంలో కొత్త ఉద్యోగి వచ్చినా రాకపోయినా బదిలీ అయిన ఉద్యోగి కొత్త పోస్టులోకి వెళ్లిపోవాల్సిందే. కానీ దీన్నే సాకుగా చూపుతూ ఉదయ్‌కుమార్ బదిలీ స్థానమైన టీబీ ఐడీ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చేసినా.. అక్కడ విధులు నిర్వర్తించకుండా కింది అంతస్తులోని పాత సీటులోనే కాలక్షేపం చేస్తున్నాడు. ఏవో అండదండలతో పాత సీట్లోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోనీ పాత సీట్లో అయినా పని చేస్తున్నాడా అంటే.. అదీ లేదు. రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు క్లియర్ చేయడం, సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ద్వారా వచ్చే దరఖాస్తులకు సమాధానాలు ఇవ్వడం వంటి పనులను ఏవో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ విధుల్లో భాగంగా బదిలీకి ముందు వరకు అదే పోస్టులో ఉన్నా, బదిలీ అయినా దాన్నే పట్టుకుని వేలాడుతున్నా కూడా ఉదయ్‌కుమార్ ఆ విధులు మాత్రం నిర్వర్తించడంలేదు. ఫలితంగా గత రెండు నెలల నుంచి బిల్లులన్నీ పెండింగులో ఉండిపోయి రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందిపడుతున్నారు. ఆర్టీఐ దరఖాస్తులు కూడా పరిష్కారానికి నోచుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### వసూళ్లు.. పెత్తనాలు..

జస్ట్.. మేడ మెట్లెక్కి పైకి వెళ్లి కొత్త సీటులో కూర్చొనే అవకాశాన్ని కూడా కాదనుకుని ఉదయ్‌కుమార్ పాతసీటులోనే కొనసాగాలని ప్రయత్నించడం, ఏవో కూడా బదిలీ అయిన ఉదయ్‌కుమార్ సీటు బాధ్యతలను కొత్తవారు వచ్చే వరకు వేరొకరికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించకుండా కాలక్షేపం చేస్తుండటం వెనుక కుమ్మక్కు వ్యవహారాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్, ఏవో, జూనియర్ అసిస్టెంట్ (ఉదయ్‌కుమార్) ఒక కోటరీగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. డీఎంహెచ్‌వో పేరుతో అనవసర పెత్తనాలకు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. ఉదయ్‌కుమార్ ఏవోకు షాడోగా వ్యవహరిస్తూ తోటి ఉద్యోగులపై పెత్తనం చేస్తున్నాడని.. పనులపై వచ్చే వారినుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. తోటి ఉద్యోగులపై ఏవోకు, డీఎంహెచ్‌వోకు చాడీలు చెబుతూ ఇబ్బందిపెడుతున్నాడని తెలిసింది. డీఎంహెచ్‌వోకు ఇవ్వాలంటూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఉదయ్‌కుమార్ ఆగడాలపై తోటి ఉద్యోగులు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు చర్యలు తీసుకోకపోవడంతో వారికీ వాటాలు ఉన్నాయన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఎట్టకేలకు బదిలీ అయ్యాడనుకుంటే.. కొత్త పోస్టులో చేరకుండా ఇక్కడే తిష్టవేశాడని డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.